## క్లుప్తంగా

### ఇంటింటా చెత్త సేకరణ



బుచ్చయ్యగారిపల్లిలో సిబ్బందికి సూచనలిస్తున్న డీపీఓ సమత

**పుట్టపర్తి:** జిల్లాలో స్వచ్ఛ సంకల్పంతో యజ్ఞంలా ఇంటింటా చెత్త సేకరణ చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారిణి(డీపీఓ) సమత అన్నారు. ఆమె ఆదివారం బుక్కపట్నం మండలంలో పలు పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది చేపట్టిన ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రతి వీధి, ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చెత్త సేకరణలో స్థానిక పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ కుమార్‌రెడ్డి, బుచ్చయ్యగారిపల్లి సర్పంచ్ రూప, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టల కేశప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ మండల కమిటీ ఎన్నిక

**తనకల్లు:** మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా సురేంద్ర, జయచంద్ర, ఉపాధ్యక్షులుగా ఆంజినేయులు శంకర్‌రెడ్డి, వెంకటరాయప్ప, విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారిగా నేసే జానకీరామ్, కార్యదర్శులుగా వెంకటరమణ, భారతి, జానకీరాం, కారుకూరి, కార్యవర్గ సభ్యులుగా పాపిరెడ్డి, ఎల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భాబాఫక్ర్‌ద్దీన్, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండలాధ్యక్షుడు బాబురెడ్డి, నాయకుడు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**నల్లచెరువు:** బీజేపీ మండలాధ్యక్షుడు కమ్మల వేమనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటరెడ్డి, అనిల్ కుమార్, శంకరాచారి, నరసమ్మ, మండల కార్యదర్శులుగా హరికృష్ణ, రెడ్డెప్ప, ఆదిరెడ్డి ఎన్నికయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీటీ ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి పాల్గొన్నారు.

### కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



బెల్టులు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తదితరులు

**ధర్మవరం:** పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీ స్టార్ బుడోఖాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కదిరి సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్ అలి, సీనియర్ బ్లాక్‌బెల్టర్ నవ్యశ్రీల చేతులమీదుగా కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్ బెల్టులతోపాటు ప్రశంసా పత్రాలు అందించారు. ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణగా ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

### శుభకార్యం

**రామగిరి:** మండలంలోని పెనుబోలులో ఆదివారం కత్తె పెద్దన్న కుమారుడి వివాహం జరిగింది. వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ వేర్వేరుగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పోలేపల్లిలో శివమాలధారులు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### నేత్రదాత కుటుంబ సభ్యులకు సన్మానం



నేత్రదాత కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన పూజారి రామాంజనేయులు ఈనెల 10న గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఈనేపథ్యంలో ఆదివారం దాత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు పూజారి జగదీష్, కోడలు నటరాణిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, యాపిల్ బికేర్ ఆస్పత్రి డాక్టర్ జగన్‌మోహన్, డాక్టర్ నరసింహులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్‌కృష్ణ, ఆలంబన జనార్ధన్, టెక్నీషియన్ రాఘవేంద్ర, విశ్వదీప సేవా సంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు గాజుల సురేష్ పాల్గొన్నారు.

# మహిమాన్వితుడు వీరనారాయణుడు

- ఈనెల 27న పరుష
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

**ముదిగుబ్బ:** కమ్మవారిపల్లిలో వెలసిన వీరనారాయణస్వామి మహిమాన్వితుడిగా వెలుగొందుతున్నాడు. కోరిన కోర్కెలు తీర్చడంతోపాటు స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే ఏ ఆపద రాకుండా కాపాడుతాడని భక్తుల నమ్మకం. ప్రధానంగా స్వామి వారు వెలగ గంపలో ఆవాహనై భక్తులను రక్షిస్తారని ప్రతీతి. ఏటా శివరాత్రి మరుసటి రోజున పరుష నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 27న జరిగే పరుష కోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ప్రత్యేకం.. భవిష్యవాణి**

ఎద్దులు, బండ్లు, ట్రాక్టర్లు ఇతర వాహనాలను స్వామి వారి ఆలయం(వెలగ గంప వుంచిన ప్రదేశం) చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఇలా చేయడం వల్ల స్వామి వారు ఏడాది పొడవునా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా కాపాడుతారని, అందరూ సుభిక్షంగా ఉంటారని భక్తుల నమ్మకం. పరుష రోజున నల్లమేకల సాయి అనే వ్యక్తిని స్వామి వారు ఆవహించి భవిష్యవాణి చెబుతారు. దీని ఆధారంగా రైతులు ఏడాది వర్షాల ఆగమనం, పంటలు పండే తీరును తెలుసుకుని వాటికి అనుగుణంగా వ్యవసాయ పనులకు సిద్ధమవుతారు. ఈ పరుషకు రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.



వీరనారాయణస్వామి ఆలయం



పరుషలో వెలగ గంప ఉంచే ప్రాంతం


**ఈ సారైనా వసతులు కల్పించేరా?**

లక్షలాది మంది భక్తులు హాజరయ్యే వీరనారాయణస్వామి పరుషకు వసతులు కల్పించడంలో అధికారులు ప్రతిసారీ విఫలం అవుతున్నారు. పరుషలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో పాటు పరుష జరిగే ప్రాంతానికి ఒకే మార్గం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరుషలోకి వెళ్లేందుకు ఒక దారి, పరుష నుంచి వచ్చే వారికి మరోదారిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు అంటున్నారు. అలాగే మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

### పరుష నిర్వహణ ఇలా..

కమ్మవారిపల్లిలో ఉన్న వీరనారాయణస్వామి ఆలయం నుంచి శివరాత్రి రోజున ఉదయానే ఉపవాస దీక్షలతో కాలినడకన భక్తులు, ఆలయ పూజారులు కన్నెకలగొందికి చేరుకుంటారు. అక్కడ వెలసిన శివాలయంలో శివునికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. అనంతరం డప్పు వాయిద్యాలతో బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి వెళ్లి వీరనారాయణ స్వామి వారికి ప్రీతిపాత్రులైన పూజారి తాళ్ల నారాయణ వంశస్తులు వెదురు దబ్బలతో అల్లి తయారు చేసిన వెలగ గంప'(వెలమ) తీసుకొని పాముదుర్తిలోని రెడ్డివారిబావి వద్ద గంగపూజ నిర్వహిస్తారు, అక్కడ నుంచి కన్నెకలగొందికి కాలినడకన చేరుకుంటారు. శివాలయంలో వెలగ గంపను పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. కన్నెకగొంది నుంచి స్వామి వారి వెలగ గంపను డప్పు వాయిద్యాల మధ్యన గుంజేపల్లి మీదుగా సంకేపల్లి వద్ద నున్న పరుష మాన్ల వద్దకు చేర్చి వీరనారాయణస్వామి వెలగ గంపను ప్రతిష్ఠిస్తారు. ఈ పూజలన్నీ నిర్వహించడానికి ఒక రోజు సమయం పడుతుంది. మహాశివరాత్రి మరుసటి రోజున పరుష మాన్లలో వీరనారాయణ స్వామికి పూజారులు గంగమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించి పరుషను ప్రారంభిస్తారు. వెలగ గంపను దర్శించుకుంటే ఎలాంటి ఆపదలు కలగవని భక్తుల నమ్మకం.

### పాతూరులో పెద్దమ్మ స్వామి పరుష



పెద్దమ్మ స్వామి మూల విరాట్

ముదిగుబ్బలోని పాతూరులో వెలసిన పెద్దమ్మ స్వామి పరుషను శివరాత్రి సందర్భంగా నిర్వహించనున్నారు. జాగరం రాత్రి పెద్దమ్మస్వామి మూల విరాట్‌ను పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. తెల్లవారే సరికి గ్రామ వెలుపల ఉన్న నల్లలమ్మ స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లతారు. అక్కడ పెద్దమ్మస్వామి పరుష ఘనంగా జరుగుతుంది. ఈ వేడుకలను వీక్షించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. ఈ పరుష మూడు రోజుల పాటు జరుగనుంది.

# శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



చిల్లవారిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్



పూజలందుకున్న కాటికోటేశ్వర స్వామి

**తాడిమర్రి:** చిల్లవారిపల్లి సమీపంలోని శ్రీకాటికోటేశ్వర క్షేత్రంలో మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు గతంలో జరిగిన ఉత్సవాల్లో ఘర్షణలు, గొడవలకు దిగిన అనుమానితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాములు, దొడ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం ఆయన పెద్దసఖ్యలో పోలీసులతో గ్రామవీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గుడికట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆధిపత్యం కోసం గొడవలు సృష్టించడానికి కృషి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు భయాందోళలు చెందకుండా ప్రతి ఒక్కరూ కలసిమెలసి ఉత్సవాలను జరుపు కోవాలన్నారు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామ్‌రావ్, తాడిమర్రి, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, పట్నం ఎస్‌ఐలు కృష్ణవేణి, శ్రీనివాసులు, సోమశేఖర్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

**కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు**

కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం నాల్గవ ఆదివారం పురష్కరించుకుని భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు, గొడుగులు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ పరిసరాల్లో పాలపొంగులు నిర్వహించారు. ఆలయంలో రాత్రి నిద్ర చేసిన భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ఉరుముల వారితో కాటమయ్య (కాటికోటేశ్వర) స్వామి జీవితచరిత్ర చెప్పించారు.

# అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న వన్‌టౌన్ ఎస్‌ఐ గోపికుమార్, నిర్వాహకులు

**ధర్మవరం అర్బన్:** ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో ధర్మవరం మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపి మెడల్స్, ట్రోఫీ సాధించడం హర్షణీయమని వన్‌టౌన్ ఎస్‌ఐ గోపికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఆదివారం ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంచైజీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చెన్నైలో ఈసీఎంఏఎస్ అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ డైరెక్ట్ అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థులు జైనందన్, మోక్షజ్ఞ చాంపియన్ ఆఫ్ చాపియన్ సాధించారన్నారు. పన్విన్ శౌర్య, ఆదిత్యసాయి ఛాంపియన్ ట్రోఫీ, ధన్విన్ కృష్ణ, దానిష్‌రాజ్, జయదీప్, హవిషశ్రీ, విన్నర్ ట్రోఫీ, లోహిత్, సజీవ్, మోనిత్, త్రితిక, లోకేష్ టాపర్స్‌గా నిలిచారన్నారు. ఎస్‌ఐ చేతులమీదుగా అవార్డులు, సర్టిఫికెట్లు అందించారు. సాంస్కృతిక మండలి అధ్యక్షుడు సత్రసాల ప్రసన్నకుమార్, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తాగునీటిపై ముందస్తు చర్యలు తీసుకోండి




మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

**కదిరి అర్బన్:** వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రాధాబాయ్, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ముందు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చెన్నకేశవులు ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని 15 రోజుల్లో తొలగిస్తామని సర్పంచులు, ఎంపీటీసీలకు హామీ ఇవ్వడంతో సభ సజావుగా జరగడానికి సభ్యులు సహకరించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండడంతో నీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీఉకోవాలన్నారు. పక్కా గృహాల నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్లు త్వరగా మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను సభ్యులు కోరారు. అంతకు ముందు పలు శాఖల అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు.

# మోసగించడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

**ధర్మవరం:** అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి జిల్లా నేత పురుషోత్తం, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, శ్రీహరి, యువజన నాయకులు రామంజి, నాగార్జున, అంజన్, చోటు విమర్శించారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మూడువారాలుగా గ్రూప్–2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటూనే న్యాయం చేస్తున్నట్లు నటించి చివరికి వారిని నట్టేట ముంచారన్నారు. గ్రూప్–2 పరీక్షల విషయంలో లోకేష్ ఒక మాట, చంద్రబాబునాయుడు ఒక మాట చెబుతున్నారన్నారు. ఒకవైపు వాయిదా వేయిస్తున్నామంటూ చెప్పి మరోవైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం తక్షణమే అత్యవసరంగా సమావేశమై గ్రూప్–2 అభ్యర్థులకు స్పష్టత నివ్వాలన్నారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అభ్యర్థులను బేషరతుగా విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికీ ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇప్పుడు దాని గురించే పట్టించుకోలేదన్నారు. తాము గెలిస్తే వలంటీర్లకు రూ.పదివేల వేతనం ఇస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత 2.6 లక్షల మంది ఉద్యోగాలను తీసేశారన్నారు. రేషనలైజేషన్ పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్‌లో 18 వేల మంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో, ఏపీ ఎండీసీ, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వేలాది మందిని తొలగించారని విమర్శించారు.

# స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దండి



దాదులూరులో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శాంతకుమారి

**కనగానపల్లి:** గ్రామాల్లో క్రమం తప్పకుండా ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి.. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ శాంతకుమారి తెలిపారు. ఆదివారం మండలంలోని దాదులూరు గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణను పరిశీలించారు. స్థానిక పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలసి ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయకూడదని సూచించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తారని వెల్లడించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ముదిగుబ్బ:** మద్దన్నగారిపల్లిలో ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన సమాచారం.. పట్నం గ్రామానికి పురుషోత్తం మద్దన్నగారిపల్లికి చెందిన సుశీలను వివాహం చేసుకొని అక్కడే స్థిరపడ్డాడు. ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటు జీవనం సాగించేవాడు. గ్రామంలో విద్యుత్ స్థంభం నుంచి విద్యుత్ తీగ తెగిపోవడంతో వాటిని సరిచేయడానికి వెళ్లి ప్రమాదపు శాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### ఆలయంలో చోరీ

**ధర్మవరం రూరల్:** చిగిచెర్ల వద్ద ముష్టూరుకు వెళ్లే రహదారిలో వెలసిన వీరముద్దప్పస్వామి, గంగమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. పూజారి పుల్లన్న తెలిపిన వివరాలు.. పూజారి రోజూలాగే శనివారం సాయంత్రం ఆలయంలో పూజలు నిర్వహించి తాళం వేసి ఇంటికెళ్లాడు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా గేటు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా స్వామికి చెందిన 10 తులాల వెండి ఆభరణాలు, హుండీలోని నగదు ఎత్తుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**రెండురోజులు నీటి సరఫరా బంద్**

**ధర్మవరం:** పట్టణానికి రెండు రోజులు నీటి సరఫరా బంద్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తంబాపురం వాటర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో విద్యుత్ లైన్లు కాలిపోయాయని, వాటి మరమ్మతుకు రెండురోజులు పడుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

**రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు**

**బత్తలపల్లి:** అప్పరాచెరువు చెరువు కట్ట వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన సమాచారం.. ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురానికి చెందిన గుజ్జల శ్రీనివాసులు తన భార్య భాగ్యలక్ష్మితో కలిసి నార్పల సమీపంలో జరిగిన శుభాకార్యానికి హాజరై స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అప్పరాచెరువు చెరువు కట్ట వద్ద వెనుక నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఘటనలో దంపతులిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.

**గిట్టుబాటు ధర కల్పించాలి**

**నల్లచెరువు:** రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. దీనిపై ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎం మండల కన్వీనర్ రామకష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, మండల కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శేఖర్, రజియ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు ఇబ్బందులు కల్గించొద్దు**



తోపుడు బండివ్యాపారికి సూచనలిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్

**పుట్టపర్తి టౌన్:** పట్టణంలో ఫుట్‌పాత్ వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ప్రజలకు ఇబ్బందుల కలగకుండా నడుచుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలో మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై ఉన్న అంగళ్లను రోడ్డు పక్కకు జరిపించారు. అనంతరం ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సత్యసాయి మహాసమాధి దర్శనార్థం దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారని వారికి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

**కంటి వైద్యశిబిరం**

**ఓడీచెరువు:** మండలంలోని చౌడేపల్లి సమీపంలో ఉన్న గీతా మందిరం వద్ద ఏకల్ ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఆస్టర్ హాస్పిటల్ బృందం పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి కంటి అద్దాలు అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గీతా మందిరం నిర్వాహకులు పాల్గొన్నారు.

### కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ట

**ధర్మవరం అర్బన్:** రేగాటిపల్లి రోడ్డు సమీపంలో నున్న కాలభైరవస్వామి గుడిలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజ, నవగ్రహ, కలశ స్థాపన, యంత్ర ప్రతిష్ట, గంగపూజ, యాగశాల ప్రవేశం, జలధివాసం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గణపతి, నవగ్రహ, రుద్ర, దీక్ష, సుదర్శన, లక్ష్మీనారాయణ, వాస్తు, అష్టదిగ్బంధన, ప్రధాన దేవత హోమాలను అర్చకులు చేశారు. సోమవారం కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, గుర్రం ఈశ్వరయ్య, శ్రీనివాసులు, సాంబ, చింతా శ్రీనివాసులు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పాల పొంగులు



కాటికోటేశ్వరక్షేత్రంలో పాలపొంగులకు తరలివచ్చిన మహిళలు

**బత్తలపల్లి:** మాఘ మాస దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు నాలుగో ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అక్కడ కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి స్వామికి సమర్పించారు. సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణ స్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టురు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి ఆలయంలో పాల పొంగులు జరిగాయి.

### గడ్డివామి దగ్ధం



తంబాపురంలో కాలిపోతున్న గడ్డివామి

**బత్తలపల్లి:** తంబాపురంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆకులేటి లక్ష్మీనారాయణ గ్రామ శివారులో అగ్రహారం వెళ్లే రోడ్డుకు మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం(వేరుశనగ కట్టె) వామి వేసుకున్నాడు. వామి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎండుగడ్డికి నిప్పుపెట్టడంతో మంటలు వామికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. పక్కనే ఉన్న కురుబ పోతలయ్య పశువుల ఎరువు అంటుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనలో రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు లక్ష్మీనారాయణ వాపోయాడు. ఇదిలా ఉండగా మంటల తాకిడికి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో రెండు రోజులు పాటు ధర్మవరం పట్టణానికి నీరు సరఫరా ఆపివేయనున్నట్లు ధర్మవరం పురపాలక సంఘం అధికారులు ప్రకటించారు.

### 'సాయి ప్రూడెంట్'కు అనూహ్య స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

**పుట్టపర్తి అర్బన్:** ఉచిత ఎంబీఏ కోర్సు కోసం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో ఆదివారం నిర్వహించిన సాయి ప్రూడెంట్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. జర్మనీకి చెందిన అనహతా స్టిఫ్టంగ్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత విద్యను అందించనున్నారు. నలు మూలల నుంచి 871 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అర్హులైన విద్యార్థులను ఏప్రిల్ లో ప్రకటించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రశాంతి పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి పరీక్షల హాజరైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

### జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



నల్లమాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**పుట్టపర్తి టౌన్:** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని చోరీలు, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరగకుండా పలు సూచనలు చేశారు. హెల్మెట్ వాడకం, ఫేస్ వాష్‌పై అవగాహన కల్పించారు. గ్రామాలను సందర్శించి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.